క్లుప్తంగా

క్రీడలతో మానసిక ఉల్లాసం

- చందులూరు హైస్కూల్‌లో బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం



బ్యాడ్మింటన్ కోర్టును ప్రారంభించి ఆడుతున్న బోధన సిబ్బంది

లక్కవరపుకోట: క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు మనోవికాసం పెంపొందుతుందని చందులూరు హైస్కూల్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు అన్నారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో బ్యాడ్మింటన్ కోర్టులను హెచ్‌ఎం శివరామకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా వచ్చే ప్రశంసాపత్రాలు ఉన్నత చదువులు, ఉన్నతోద్యోగులకు 3శాతం క్రీడా కోటా కింద ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో పలువురు బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

గజపతినగరం ఐసీడీఎస్ పీఓగా రాజేశ్వరి



గజపతినగరం: స్థానిక ఐసీడీఎస్ పీఓగా ఎం.రాజేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించా రు. ఈమె చీపురుపల్లి నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇదివరకు ఇక్కడ పని చేసిన నాగమణికి చీపురుపల్లి బదిలీ అయ్యింది. రాజేశ్వరికి ఐసీడీఎస్ సిబ్బంది స్వాగతం పలికారు.

వృద్ధులపై చిన్నచూపు తగదు



మాట్లాడుతున్న జడ్జి విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరం రూరల్: వృద్ధులపై చిన్నచూపు తగదని, వృద్ధ తల్లిదండ్రులను విస్మరించే పిల్లలపై చట్టపరమైన చర్యలు తప్పవని గజపతినగరం ఫస్ట్‌క్లాస్ కోర్టు జడ్జి విజయ్ రాజ్‌కుమార్ అన్నారు. ప్రపంచ వృద్ధుల వేధింపు వ్యతిరేక దినం సందర్భంగా కోర్టు ఆవరణలో సోమవారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ వృద్ధ తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే పేరెంట్స్ యాక్ట్-2007 ప్రకారం తల్లిదండ్రులకు పిల్లల నుంచి భరణం ఇప్పించడం జరుగుతుందని చెప్పారు. ఆస్తులను రాయించుకుని తిండిపెట్టని పిల్లల వల్ల ఇబ్బందులు పడే తల్లిదండ్రులు నేరుగా కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. కోర్టు వారికి న్యాయం చేసి పిల్లల నుంచి రక్షణ కల్పిస్తుందని తెలిపారు. పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత



బాధితురాలికి ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

లక్కవరపుకోట: ఆనారోగ్యంతో బాధ బడుతూ, వివిధ ప్రమాదాల్లో గాయపడి ఆరోగ్యశ్రీ వర్తింపు చెందని వారిని ముఖ్యమంత్రి సహాయ నిధి ఆదుకుంటుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల ఆమె స్వగృహంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.24,19,027 చెక్కులను సోమవారం ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పాలన ప్రారంభమైన తరువాత ఇప్పటి వరకు సుమారు కోటి రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పరిహారం మంజూరు చేయించి పేదలకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కొత్తవలస మార్కెటింగ్ కమిటీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, పలువురు టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి



చిన్నయ్య, పైడితల్లి కుటుంబాలను పరామర్శిస్తున్న అప్పారావు

గంట్యాడ: మండలంలోని రామవరం గ్రామంలో ఆదివారం గోడకూలిన ఘటనలో కూలీలు ఎర్ర చిన్న య్య, కొలుసు పైడితల్లి మృతి చెందారు. ఈవిషయం తెలుసుకున్న కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు పురం అప్పారావు మృతుల కుటుంబాలను సోమవారం పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేసియా ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గజపతినగరం మండలం రంగుపురంలో కొత్తవలస సత్యం, ఎస్.కోట మండలం గోపాలపల్లిలో ఒక గీత కార్మికుడు మరణించారని, ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. మృతుల కుటుంబ సభ్యులు గీత కార్మికులకు అందించే సహాయం గురించి సచివాలయాల్లో పదేపదే అడుగుతుంటే సైట్ పనిచేయడం లేదని సిబ్బంది చెబుతున్నారన్నారు. పరామర్శించిన వారిలో కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి అప్పారావు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అంతా మోసమే

- మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వెన్నుపోటు పుస్తకావిష్కరణ



కూటమి ఏడాది పాలన వైఫల్యాలపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ నెక్కలనాయుడుబాబు తదితరులు

కొత్తవలస: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంటే ఓ నమ్మకం..చంద్రబాబు అంటే మోసానికి మారుపేరు అని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన మండలంలోని అర్ధానపాలెం గ్రామం సమీపంలో గల ఆయన క్యాంపు కార్యాలయంలో డీసీసీబీ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో వైఫల్యాలపై వెన్నుపోటు పుస్తకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కడబండి శ్రీనివాసరావు మాట్లాడుతూ పేద ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడికి వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన చంద్రబాబు సంక్షేమ పథకాలు ఇవ్వకుండా, ఇచ్చిన ఒకటి రెండు పథకాల్లో కోతలు విధిస్తున్నారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇచ్చిన మాట ప్రకారం ఒక క్యాలెండర్‌ను రూపకల్పన చేసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తలుపుతట్టి మరీ సంక్షేమ పథకాలు అందించామని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రజలు ఏడాది పాలనలో ఆనాటి జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీరు..ప్రస్తుత కూటమి ప్రభుత్వం తీరును గుర్తు చేసుకుంటున్నారన్నారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్య, ఆరోగ్యం ప్రజలకు ముఖ్యమని, అలాంటి ఆ రెండింటిని నీరుగార్చే తీరులో ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు వస్తే జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఏడాదిలోనే వ్యతిరేకత

డీసీసీబీ మాజీ చైర్మన్ నెక్కల నాయుడుబాబు మాట్లాడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చంద్రబాబునాయుడు వైఫల్యం చెందారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఏడాదిలోనే అన్ని పథకాలు అమలు చేస్తే, నేటి కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఒక పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వంపై ఏడాదిలోనే పూర్తి వ్యతిరేకత వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ మండలాల ఎంపీపీలు గేదెల శ్రీనివాసరావు, నీలంశెట్టి గోపెమ్మ, దొగ్గ సత్యవంతుడు, జామి మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొర్లె రవికుమార్, కొత్తవలస మాజీ ఎంపీపీ గొరపల్లి జయప్రకాష్(శివ), పార్టీ ముఖ్యనాయకులు బొంతల వెంకటరావు, పల్లా భీష్మ, వెలగల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుది దగాకోరు పాలన



'జగన్ అంటే నమ్మకం..చంద్రబాబు అంటే మోసం' పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొత్స, తదితరులు

- అధికారం కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చారు
- ఏడాది పాలనలో ఒక్కహామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు
- విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: టీడీపీ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన అంతా మోసం, దగా, అవినీతి, అబద్ధాలు, దాడులు, దోపీడీలు తప్ప ఇంకేమీ లేదని గజపతి నగరం మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య ఆరోపించారు. గజపతినగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక పరిపాలనపై వైఎస్సార్‌సీపీ అధిష్ఠానం ముద్రించిన 'జగన్ అంటే నమ్మకం .. చంద్రబాబు అంటే మోసం' అనే పుస్తకాలను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన ఏహామీ కూడా అమలుకు నోచుకోలేదు సరికదా ఏడాది పాలన అంతా మోసాలు,అరాచకాలే కనబడుతున్నాయని అన్నారు. అధికారం కోసం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సూపర్ సిక్స్‌తో పాటు వందల హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ఏడాదికాలంలో ఒక్కహామీని కూడా అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినదానికంటే రెండింతలు సంక్షేమం అందిస్తామని హామీలు ఇచ్చి, నేడు పథకాలను అమలు చేయకుండా ప్రజలను వంచించారని, నట్టేట ముంచేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాల ను అమలుచేయాలని ప్రశ్నించే వారిపై కేసులు పెడుతున్నారని దుయ్యబట్టారు. ప్రజాసంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, జర్నలిస్టులపై కేసులు బనాయిస్తున్నారని, ఒక వైపు సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు పెడుతున్నా ఇంకా చంద్రబాబులో మార్పు రావడం లేదన్నారు. తల్లికి వందనం పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో 87లక్షలమంది తల్లులు ఉంటే కేవలం 54లక్షలమందికి మాత్రమే ఈపథకం వర్తింప చేశారని చెప్పారు. ఏడాది పాలనలో సీఎం చంద్రబాబునాయుడు ఒక్క పథకం కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేకపోయారని దుయ్యబట్టారు. జెడ్పీటీసీ గార తవుడు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఏడాదికి అయిదు లక్షల ఉద్యోగాలను ఇస్తామని చెప్పిన చంద్రబాబు తన ఏడాది పాలనలో నాలుగు లక్షల మందికి ఉద్యోగాలను పీకేశారని ఆరోపించారు. మండల యువ నాయకులు, పురిటిపెంట గ్రామ మాజీ సర్పంచ్ సురేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 30వేల మంది మహిళలు మిస్సింగ్ అయ్యారని, ఆడపిల్లలకు జగన్ ప్రభుత్వంలో రక్షణ లేకుండా పోయిందని పూర్తి అవాస్తవాలతో పవన్ కల్యాణ్ అప్పటిలో ఊగిపోయారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంతమంది మహిళలను తిరిగి రాష్ట్రానికి రప్పించారో చెప్పాలని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో మహిళలు,బాలికలకు రక్షణ లేకుండా పోయిందని, అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. ఈ ప్రభుత్వంలో ఎంత మంది ఆడపిల్లలకు అన్యాయం జరిగిందో మీకు తెలియదా అని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ గజపతినగరం మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, సీనియర్ నాయకులు కరణం ఆదినారాయణ, మధుపాడ గ్రామ సర్పంచ్ కె.పైడుపునాయుడు, గోవింద,తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల పిల్లలకు సంక్షేమ పథకాలు అందజేయాలి



కొత్తవలస: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



లక్కవరపుకోట: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



వేపాడ: అంగన్వాడీ కార్యకర్తలకు సంక్షమే పథకాలు అందించాలంటూ నినాదాలు చేస్తున్న కార్యకర్తలు



ఎస్.కోట: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు



చీపురుపల్లి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

లక్కవరపుకోట/కొత్తవలస: అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పిల్లలకు తల్లికి వందనం, రేషన్ కార్డుల జారీ వంటి సంక్షేమ పథకాలు అందజేయాలని కోరుతూ కొత్తవలస, లక్కవరపుకోట మండల కేంద్రాల్లో గల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. రూ 12వేల లోపు ఆదాయం కలిగిన వారికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిదని, అంగన్‌వాడీ కార్యకర్తలకు రూ.11,500, ఆయాలకు రూ.7000 గౌరవ వేతనం అందజేస్తున్నారని అయినా సంక్షేమ పథకాలు అందజేయలేదని వాపోయారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పిలలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆయా మండలాల డిప్యూటీ తహసీల్దార్‌లకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, తరిణి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

చీపురుపల్లి ఐసీడీఎస్ పరిధిలో అతి తక్కువ వేతనాలతో పని చేస్తున్న అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని ప్రాజెక్టు లీడర్ కె.నాగమణి డిమాండ్ చేశారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపు మేరకు సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ హర్షవర్ధినుకు వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడీలకు నెలకు కేవలం రూ.11,500 మాత్రమే వేతనం ఇస్తున్నారన్న విషయం గుర్తించి తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో లత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి పీలుస్తూ పట్టుబడిన యువకులు

శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక గంజాయి పీలుస్తున్న నలుగురు యువకులను ఎస్.కోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమకు వచ్చిన సమాచారంతో ఎస్.కోట పోలీసులు సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్దకు వెళ్లి పరిశీలించగా, ఎస్.కోటకు చెందిన వెంకట సత్యనిఖిల్, గణేష్, కలిగొట్లు గ్రామానికి చెందిన పూర్ణకుమార్, అనంతగిరి మండలానికి చెందిన కన్నయ్య అనే నలుగురు యువకులు గంజాయి పీలుస్తూ పట్టుబడ్డారు. దీంతో వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, గంజాయి స్మగ్లింగ్ చేసినా, వినియోగించినా కఠినమైన కేసులు నమోదు చేస్తామని ఎస్.కోట సీఐ స్పష్టం చేశారు.

అహ్మదాబాద్ మృతులకు నివాళి



మృతులకు నివాళులు అర్పిస్తున్న సంఘ నాయకులు

విజయనగరం టౌన్: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని మూడు లాంతర్ల జంక్షన్ వద్ద సోమవారం నివాళులర్పించారు. అనంతరం ఆ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ దుర్గారావు మాట్లాడుతూ విమాన ప్రమాద ఘటన చాలా విషాదకరమని, మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని, బాధిత కుటుంబాలకు ఆ భగవంతుడు ధైర్యాన్నివ్వాలని కోరారు. కార్యక్రమంలో దవళ సర్వేశ్వరరావు, ఎస్‌కే భాషా, ఎం.చంద్రకళాధర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



చిట్టిబాబును సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

విజయనగరం లీగల్: జిల్లా కోర్టు ప్రాంగణంలో విజయనగరం బార్ అసోసియేషన్ సభ్యుడు పెంకి చిట్టిబాబును సోమవారం ఘనంగా సన్మానించారు. విజయనగరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కె.రవిబాబు మాట్లాడుతూ నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఇండియా ఇచ్చే అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న సి.సుబ్రహ్మణ్యం జాతీయ అవార్డు చిట్టిబాబును వరించడం న్యాయవాదులందరికీ గర్వకారణమన్నారు. న్యూఢిల్లీలో ఆయన ఆ అవార్డు అందుకున్నందున ఇక్కడ ఈ అభినందన సభ, సన్మానం ఏర్పాటు చేశామన్నారు.

ప్రమాదకరంగా జాతీయ రహదారి



నిమ్మలపాలెం బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకుండా పెరిగిపోయిక తుప్పలు



నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో పరిస్థితి

- రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోయిన తుప్పలు
- సంభవిస్తున్న పలు ప్రమాదాలు

కొత్తవలస: అరకు–విశాఖపట్నం జాతీయ రహదారి అత్యంత ప్రమాదకరంగా మారిపోయింది. ఈ రోడ్డులో ఎక్కడ పడితే అక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వర్షం నీరు గోతుల్లో చేరి చెరువులను తలపిస్తున్నాయి. అలాగే ఈ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగిపోయి అత్యంత ప్రమాదకరంగా మారాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా మండలంలోని నిమ్మలపాలెం జంక్షన్ సమీపంలో గల బ్రిడ్జి వద్ద పిచ్చి తుప్పలు దట్టంగా పెరిగిపోయాయి. ఈ ప్రదేశంలో గడిచిన నెల నుంచి నేటి వరకు 5 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడగా ఒకరు మృత్యువాత పడ్డారు. అయినా రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించేందుకు అధికారులు చొరవ చూపడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా గల తుప్పలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

వరి విత్తనాల పంపిణీ



శ్రీరంగరాజపురంలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఓ కిరణ్‌కుమార్

గజపతినగరం: మండలంలోని శ్రీరంగరాజపురం, పురిటిపెంట గ్రామాల రైతులకు ఆయా గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాల్లో మండల వ్యవసాయశాఖ అధికారి (ఏఓ) పి.కిరణ్‌కుమార్ సోమవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు. విత్తన శుద్ధి, నారుమడులు తయారీ, వరి వెదజల్లే పద్ధతులపై అవగాహన కల్పించారు. వీఏఏలు వాసవి,వినయ్, తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: గడసాంలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్నఏఈఓ లీలాకృష్ణ, తదితరులు

దత్తిరాజేరు మండలంలో..

దత్తిరాజేరు: మండలంలోని గడసాం రైతుసేవా కేంద్రం వద్ద రైతులకు ఏఈఓ లీలాకృష్ణ సోమవారం వరి విత్తనాలు పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధ నల ప్రకారం రైతులందరికీ విత్తనాలు అందజేస్తామ ని, ఇంకా విత్తనాలు చాలవనుకునే వారు ప్రత్యామ్నయం చూసుకోవాలని చెప్పారు. రైతులు మొలక శాతాన్ని పరీక్షించు కుని నాటుకోవాలని, మొలకలు రాకపోతే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

- భారీ అన్నసమారాధన
- స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వేపాడ:

మండలకేంద్రం వేపాడలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం పదో వార్షికోత్సవం వైభవంగా సోమవారం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ అనంతరం స్నపన తిరుమంజనంలో స్వామివారికి సుగంధ ద్రవ్య అభిషేకం, నక్షత్రహారతి, పట్టువస్త్రాలంకరణ, కర్పూర హారతితో అభిషేకం అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. అనంతరం అనకాపల్లికి చెందిన రేజేటి గోప అప్పలాచార్యులు(చక్రవర్తి) వేదపండితుల బృందంతో శ్రీదేవీ భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం అంగరంగవైభవంగా నిర్వహించారు. గ్రామపెద్దలు, దాతల సహకారంతో అన్నసమారాధన నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు. మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరు రఘురాజు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారికి కర్పూరహారతి ఇస్తున్న ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్



స్వామివారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం




చీపురుపల్లి:అమ్మవారి దేవస్థానంలో యోగాంధ్ర

చీపురుపల్లి: ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని యోగా టీచర్ గవిడి సుజాత అన్నారు. పట్టణంలోని కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులతో యోగాసనాలు వేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీపీ, సుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు నుంచి దూరం కావాలంటే యోగా ఎంతో అవసరమని చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

బొండపల్లి: యోగా సాధన వల్ల కలిగే ప్రయోజనాలపై గొట్లాం ఉన్నత పాఠశాల లో విద్యార్థులకు పిరమిడ్ సేవాదల్ జిల్లా కన్వీనర్ వి.రామకృష్ణ సోమవారం అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా రోజూ యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని, మానసిక ప్రశాంతత లభిస్తుందని, ఏకాగ్రత పెరుగుతుందని వివరించారు. అనంతరం విద్యార్థులతో పలు ఆసనాలు వేయించారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పుణ్యగిరిలో ఆసనాలు వేస్తున్న దేవాదాయ శాఖ ఉద్యోగులు

పుణ్యగిరిలో యోగాంధ్ర

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరి గ్రామంలో సోమవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని పుణ్యగిరి దేవస్థానం సిబ్బంది, అర్చకులు నిర్వహించారు. పుణ్యగిరి వద్ద ఉన్న దేవస్థానం కార్యాలయంలో పుణ్యగిరి ఉమాకోటిలింగేశ్వరస్వామి దేవస్థానం, ధారగంగమ్మ ఆలయాల ఉద్యోగులు, సిబ్బంది, అర్చకులు, అంతా కార్యక్రమంలో పాల్గొని పలు యోగాసనాలు వేశారు. ధ్యానం సాధన చేశారు.